నగర పోలీస్ కమిషనర్‌కు ఆహ్వానం



సీపీకి ఆహ్వానపత్రం అందజేస్తున్న జితేందర్ సింగ్, ముఖేష్ సింగ్, లాల్ సింగ్, అరవింద్‌సింగ్

అబిడ్స్: విజయదశమి వేడుకలు పురస్కరించుకొని నిర్వహించే రావణ దహన కార్యక్రమానికి రావాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌కు రావణ దహన కమిటీ చైర్మన్ జితేందర్ సింగ్, లాల్‌సింగ్, ముఖేష్ సింగ్, అరవింద్ సింగ్ ఆహ్వానపత్రాన్ని అందజేశారు. పురానాపూల్ ప్రాంతంలో ప్రతి ఏడాది నిర్వహించే రావణ దహనాన్ని అక్టోబర్ 2న పెద్ద ఎత్తున నిర్వహిస్తామని వివరించారు. 75వ రావణ దహన వేడుకలకు కమిషనర్ వస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తమ కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు, దసరా వేడుకలు పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు వెల్లడించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పతనం ఖాయం



గౌతమ్‌రావును సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం భారీ అవినీతిలో కూరుకుపోయిందని ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ఖాయమని తెలంగాణ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతమ్‌రావు అన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రదాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా కార్వాన్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు కలిసి శాలువా వేసి అభినందించి సన్మానించారు. గతంలో పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ నిజస్వరూపాన్ని గ్రహించిన ప్రజలు ఆ పార్టీని చిత్తుగా ఓడించిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. కాంగ్రెస్‌కు కూడా పుట్టగతులు లేకుండాపోతాయన్నారు. ఆయనను కలిసిన వారిలో టి.యోగ్‌రాజ్ సింగ్, ఉద్దడి జగదీష్‌కుమార్ తదితరులున్నారు.

విజయలక్ష్మికి సన్మానం



బీజేపీ నూతన కార్యదర్శి బండారు విజయలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: తెలంగాణలో బీజేపీ బలీయంగా ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గందమల్ల ఆనంద్‌గౌడ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన బండారు విజయలక్ష్మిని గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో గత పాలక పార్టీ అయిన బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఛీకొట్టారన్నారు. అదే గతి ముఖ్యమంత్రి ప్రభుత్వానికి పట్టడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.దివాకర్, ప్రభుపూజారి, భానుప్రకాష్ తదితరులున్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం



డబీర్‌పురా: డబీర్‌పురాలోని ఆర్.కె.క్లినిక్ ప్రాంతంలో గురువారం డాక్టర్ మదిహాస్ ఫ్యామిలీ డెంటిస్ట్రీ డెంటల్ క్రానియోఫెషియల్ సర్జరీ అండ్ ఇంప్లాంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న పలువురికి డాక్టర్ మదిహా మహావీన్, డాక్టర్ మునాజ్జా షమీమ్, డాక్టర్ మహ్మద్ ఖలీల్ అహ్మద్‌లు వైద్య సేవలను అందజేశారు.

దళితుల సంక్షేమం బీజేపీతోనే సాధ్యం



క్రాంతికిరణ్‌కు అభినందనలు తెలుపుతున్న సుభాష్

గన్‌ఫౌండ్రీ: దళితుల సంక్షేమం బీజేపీతోనే సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఎ.క్రాంతికిరణ్ అన్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఇటీవల ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన క్రాంతికిరణ్‌ను ఎస్సీమోర్చా రాష్ట్ర నాయకుడు బండాని సుభాష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. దళితులంతా బీజేపీ వైపే ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర నాయకులు అనిల్‌చంద్ర, సందీప్, శశి, అరుణ్, శ్రీనివాస్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

దడపుట్టిస్తున్న మూతలు లేని మ్యాన్‌హోల్స్

- పాతబస్తీలో మూతలు లేని మ్యాన్‌హోళ్లతో పరేషాన్
- క్షేత్రస్థాయి పరిశీలన చేయని ఉన్నతాధికారులు
- ప్రమాదాలు సంభవించినప్పుడే హడావుడి
- మౌలాకా చిల్లాలో తృటిలో తప్పిన మ్యాన్‌హోల్ ప్రమాదం



హిమ్మత్‌పురాలో మూత లేని మ్యాన్‌హోల్



ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

చార్మినార్: పాతబస్తీలో మూతలు లేని మ్యాన్‌హోళ్లతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మూతలు లేని మ్యాన్‌హోళ్లలో ప్రమాదావశాత్తు పడి మృతి చెందిన ఘటనలు గతంలో పాతబస్తీలో ఎన్నో చోటుచేసుకున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేస్తున్న సంబంధిత అధికారులు, సాధారణ రోజుల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేసి తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నప్పటికీ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని సర్వత్రా అరోపణలు వినిపిస్తున్నాయి. గురువారం ఉదయం స్కూల్‌కు వెళ్తున్న చిన్నారి ప్రమాదావశాత్తు మ్యాన్‌హోల్‌లో పడి గాయాలకు గురైంది. యాకుత్‌పురాలోని మౌలాకా చిల్లాలో తెరిచి ఉంచిన మ్యాన్‌హోల్ గత కొన్ని రోజులుగా అటువైపు నుంచి రాకపోకలు సాగించే వాహనదారులతో పాటు పాదచారులను సైతం భయాందోళనకు గురిచేస్తోందని.. వెంటనే మూత బిగించాలని ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. చార్మినార్, యాకుత్‌పురా, బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట తదితర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో ఇలాంటి మూతలే లేని మ్యాన్‌హోళ్లు ఎన్నో ఉన్నాయని..వెంటనే మూతలు బిగించాలని డిమాండ్ చేస్తున్నారు.

జలమండలి, జీహెచ్‌ఎంసీ పర్యవేక్షణలో..

మ్యాన్‌హోళ్లు జలమండలి, జీహెచ్‌ఎంసీ ప్రభుత్వ విభాగాల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. డ్రైనేజీ మురుగునీటి పైప్‌లైన్‌ల మ్యాన్‌హోళ్లతో పాటు కచ్చా మోరీ మ్యాన్ హోల్స్ మూతలు చాలా బస్తీల్లో శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని సరి చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మ్యాన్‌హోళ్ల మరమ్మతుల పేరుతో కాంట్రాక్టర్లు ప్రభుత్వ సొమ్మును దోచుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ చాంబర్లకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి పరిశీలన చేస్తే ఆశించిన ఫలితాలుంటాయంటున్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన లేకపోవడంతో..



కాంట్రాక్టర్లకు పనులను అప్పచెబుతున్న సంబంధిత అధికారులు అవి ఎలా జరుగుతున్నాయి..సకాలంలో పూర్తి అవుతున్నాయా..లేదా అనే విషయాలను సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఎక్కడెక్కడ మూతలు లేని మ్యాన్‌హోళ్లు ఉన్నాయి..ఎక్కడ పాడయ్యాయి..అనే విషయాలను క్షేత్రస్థాయి పరిశీలన చేసి తెలుసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి.

– మహ్మద్ అహ్మద్, ఖాజీపురా

బతుకమ్మ ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

చార్మినార్: బతుకమ్మ ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేయాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో గురువారం సర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 22 నుంచి 26 వరకు బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసింద న్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15 నుంచి 21వ తేదీ వరకు స్వయం సహాయక సంఘాల గ్రూపులకు చెందిన సభ్యులకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేయనున్నమన్నారు. జోన్ పరిధిలోని హైదరాబాద్ జిల్లాకు సంబంధించిన 3,997 మహి మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయన్నారు. ఇందులో 39,773 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట్, చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు ఇంకేషఫ్ అలీ, సురేందర్, సరిత, అరుణకుమారి, సురేందర్‌రెడ్డి, యూసీడీ డిప్యూటీ ప్రాజెక్టు అధికారులు కరుణాకర్, యాదగిరి రావు, స్వాతి, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

టోలిచౌకీలో ఎమ్మెల్యే పర్యటన



టోలిచౌకీలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయిస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకీ, నానల్‌నగర్ డివిజన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గత వారమే తాను వివిధ శాఖల అధికారులతో సమావేశమై రోడ్ల మరమ్మతుల విషయమై చర్చించామనానరు. ఈపాటికే అధికారులు రోడ్ల మరమ్మతులు ప్రారంభించారన్నారు. అయితే భారీ పైప్‌లైన్ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో మాత్రం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. టోలిచౌకీ చౌరస్తా, నిజాం కాలనీ, నదీమ్ కాలనీ తదితర ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లకు ప్యాచ్‌వర్క్‌లు పూర్తయ్యాయన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, అబీబ్‌చౌస్, బల్దియా డీఈ తదితరులున్నారు.

నవంబర్ 14న చిన్నారులకు ఉచితంగా జూ పార్క్ సందర్శన కల్పించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రాజేష్ కుమార్

చార్మినార్: నెహ్రూ జూలాజికల్ పార్కులో నవంబర్ 14న చిన్నారులకు ఉచిత సందర్శన సౌకర్యం కల్పించాలని పాతబస్తీకి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు మంత్రి కొండా సురేఖను కోరారు. నెహ్రూ జూపార్క్‌లో అటవీ అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కన్నయ్య లాల్‌తో కలిసి ఆమెకు వినతిపత్రం అందజేశారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకొని నవంబర్ 14న, జాతీయ పిల్లల దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఏటా ఆ రోజు చిన్నారులకు ఉచితంగా జూ పార్క్‌లో ప్రవేశం కల్పించే వారని, ఈ ప్రక్రియ ఇప్పుడు కొనసాగడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు ముజాహిద్, మహమ్మద్ ఇక్బాల్, మీర్ మహమ్మద్, భానుచందర్ యాదవ్, జాకేర్ హుస్సేన్, దేవేందర్‌యాదవ్, నరేందర్, దేవేందర్, కృష్ణ తదితరులున్నారు.

ఆచార్య వినోబా భావేకు ఘన నివాళి



అఫ్జల్‌గంజ్: ఆచార్య వినోబా భావే జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. గాంధీభవన్‌లో జరిగిన వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి మణిలాల్‌షా, ఆలం భాస్కర్, శ్రీనివాస్ రెడ్డి, మనోహర్, కృష్ణారెడ్డిలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహిళా యూనివర్సిటీ సందర్శించిన రమా ఎల్కూర్



సుల్తాన్‌బజార్: అమెరికాలోని టెక్సాస్ ఉమెన్స్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటీవ్ డీన్ డాక్టర్ రమా ఎల్కూర్ గురువారం కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీని సందర్శించారు. ఆమెకు మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ. సూర్య ధనుంజయ్ స్వాగతం పలికి సత్కరించారు. రెండు సంస్థల మధ్య విద్యాపరమైన సహకారాలు, వివిధ కార్యక్రమాలపై సమాచార మార్పిడి టెక్సాస్ ఉమెన్స్ యూనివర్సిటీలో స్టెమ్ చొరవ పరిచయంపై సంభాషించారు. మహిళా యూనివర్సిటీ ప్రత్యేకతపై ప్రిన్సిపాల్ లోకపావని, డిప్యూటీ రిజిస్ట్రార్ స్వామిని రమా ఎల్కూర్ అడిగి తెలుసుకున్నారు.

గ్రూప్–1 పరీక్షను రద్దు చేసే వరకు ఉద్యమం



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న దృశ్యం

అబిడ్స్: గ్రూప్–1 పరీక్షను రద్దు చేసే వరకు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగుతుందని గోషామహల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఆర్‌వీ మహేందర్‌కుమార్, ఆశీష్‌కుమార్ యాదవ్, కోల్ల ప్రదీప్‌రాజ్ పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో గ్రూప్–1 పరీక్ష రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేసి అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడతూ..కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నట్టేట ముంచుతుందన్నారు. గ్రూప్–1 పరీక్ష రద్దు చేయాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ర్యాలీలు శాంతియుతంగా నిర్వహించాలి: డీసీపీ



సెంట్రల్ మిలాద్ జులూస్ కమిటీ ప్రతినిధులతో సమావేశమైన డీసీపీ స్నేహ మెహ్రా

చార్మినార్: మిలాద్–ఉన్–నబీ వేడుకల సందర్భంగా నిర్వహించే ర్యాలీలలో అపశృతి దొరలకుండా శాంతియుతంగా నిర్వహించాలని దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా మర్కజి మిలాద్ కమిటీ సభ్యులను కోరారు. ఈనెల 14న నిర్వహించనున్న మిలాద్–ఉన్–నబీ సామూహిక ర్యాలీలను పురస్కరించుకొని బుధవారం రాత్రి ఆమె సెంట్రల్ మిలాద్–ఉన్–నబీ ఊరేగింపు కమిటీ ప్రతినిధులతో పాటు మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ...గత ఏడాది కొన్ని ప్రమాదాలు సంభవించాయని..చార్మినార్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో కొంతమందికి గాయాలు సైతమైన విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ర్యాలీ సందర్భంగా బాణాసంచా కాల్చవద్దని డీజే ఎట్టి పరిస్థితుల్లో వినియోగించొద్దన్నారు. ఈ సమావేశంలో పలువురు ముస్లిం మత పెద్దలు, దక్షిణ మండలం లోని ఏసీపీలు, పాటు ఇన్స్ స్పెక్టర్ లు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



కళాకారులతో పలువురు వక్తలు

గన్‌ఫౌండ్రీ: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని విశ్రాంత అడిషనల్ ఎస్పీ పద్మనాభరెడ్డి అన్నారు. గురువారం రవీంద్రభారతిలో శ్రీ నటరాజ కూచిపూడి కళానిలయం 12వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పిల్లలకు చిన్నప్పటి నుంచి సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. 12ఏళ్లుగా అనేక విలక్షణమైన కార్యక్రమాలు చేస్తూ కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అంతకు ముందు సంస్థ అధ్యక్షురాలు చెల్లా హిమబిందు నిర్వహణలో వివిధ అంశాలపై కళాకారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోజిరెడ్డి, ఒడిస్సి నాట్య గురువు రామన్ కుమారి, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ బోదిశ్రీ భూపతి, హైకోర్టు న్యాయవాది సి.జెస్వి, చల్లా జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి



వాటర్‌బోర్డు ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్ తదితరులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలోని డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ ట్రూప్‌బజార్‌తో పాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ..ఆనంద్‌కుమార్ గౌడ్ తన దృష్టికి తెచ్చిన సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తున్నట్లు వివరించారు. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా తాగు నీరు, డ్రైనేజీ, ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తెస్తే సంబంధిత జీఎం, డీజీఎంలు, మేనేజర్లు పరిష్కారం చేస్తారని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..నియోజకవర్గంలోని పలు సమస్యలను ఎండీ అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే పరిష్కరించాలన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన నాంపల్లి రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సుమారు 45 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి ఫతేనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన ఓ రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై తెలుపు, నీలం, నలుపు రంగు గీతల చొక్కా, నలుపు రంగు ట్రాక్ ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చార్మినార్ వార్డుల సరిహద్దులు మార్చొద్దు



డీసీకి వినతిపత్రం సమర్పిస్తున్న మహ్మద్ సలావుద్దీన్ లోధి

చార్మినార్: చార్మినార్ శాసన సభ నియోజకవర్గంలోని వార్డులను యథావిధంగా కొనసాగించాలని.. వార్డుల సరిహద్దులను ఇతర నియోజకవర్గాలలో చేర్చొద్దని బీఆర్‌ఎస్ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. చార్మినార్‌లో ఎలాంటి మార్పులు చేర్పులు చేయొద్దని కోరుతూ ఆయన గురువారం జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ సర్కిల్–9 డిప్యూటీ కమిషనర్ సరితను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చార్మినార్‌లో పురానాపూల్, పత్తర్‌గట్టి, శాలిబండ, ఘాన్సీబజార్, మొగల్‌పురా తదితర 5 వార్డులున్నాయని.. వీటన్నింటిలో 198 పోలింగ్ స్టేషన్లున్నాయన్నారు. డీలిమిటేషన్ పేరుతో చార్మినార్‌లోని వార్డుల సరిహద్దులను యాకుత్‌పురా, బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట తదితర ఇతర నియోజకవర్గాల్లో కలపరాదన్నారు.

కాళోజీ సాహిత్య స్ఫూర్తి పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రజాకవి కాళోజీ తెలుగు ప్రజల గుండెలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి అన్నారు. గురువారం రవీంద్రభారతిలో గీతా ఆర్ట్స్ అకాడమీ, గీతా ఫౌండేషన్ల సంయుక్తాధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవం, కాళోజీ సాహిత్య స్ఫూర్తి పురస్కారాలను ప్రదానం చేశారు. తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య, హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు యాకూబ్, రంగస్థల నటుడు భానుమూర్తి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శ్రీధరచార్యులు కాళోజీ సాహిత్య స్ఫూర్తి పురస్కారాలను అందుకున్నారు. అంతకు ముందు తెలంగాణ కవుల సినీ, జానపద వైభవం పేరిట నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాపత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ, శృతిలయ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని, ఆదర్శ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసుమ భోగరాజు, సంస్థ వ్యవస్థాపకురాలు గీతా తదితరులు పాల్గొన్నారు.

మేజర్ నాలా ఆధునీకరణకు సర్వే



కార్పొరేటర్ భాగ్యలక్ష్మితో కలిసి సర్వే చేస్తున్న అధికారులు

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని అచ్చయ్యనగర్ మేజర్ నాలా ఆధునీకరణ పనుల కోసం గురువారం కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మితో కలిసి అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..భారీ వర్షానికి గౌలిపురాలోని బస్తీల్లోకి నీరు రాకుండా తగిన చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాన్నారు. దీంతో అధికారులు అచ్చయ్యనగర్‌లో మేజర్ నాలా ఆధునీకరణ పనుల కోసం సర్వే చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గౌలిపురా డివిజన్ అధ్యక్షుడు ఇ.సుమన్‌కుమార్ ముదిరాజ్, బీజేపీ జిల్లా మీడియా కార్యదర్శి జి.రఘుకాంత్, బీజేపీ నాయకులు రాజ్‌కుమార్ ముదిరాజ్, జమాల్‌పూర్ అశోక్, గౌలిపురా ఏఈ తేజోవంత్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే ఆత్మ స్థైర్యానికి నిలువుటద్దం

- కరాటే క్రీడాకారుల్లో పెరుగుతున్న పోటీతత్వం
- బస్తీస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో రాణింపు



ఢిల్లీలో జరుగుతున్న కరాటే పోటీలు



మెడల్స్ సాధించిన క్రీడాకారులు

జియాగూడ: కరాటే అంటే ప్రస్తుతం తెలియని వారుండరు. ప్రతి స్కూల్, ప్లే గ్రౌండ్, జీహెచ్‌ఎంసీ, కమ్యూనిటీ హాళ్లలో కరాటే, కిక్ బాక్సింగ్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలు, యువకులు, అమ్మాయిలు శిక్షణలు పొందుతుంటారు. కరాటే వల్ల ఆరోగ్యం, ఆత్మస్థైర్యం, స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేట్ విద్యా సంస్థల్లో శిక్షకులుగా, జీహెచ్‌ఎంసీ వేసవి శిక్షణ శిబిరాలు, పర్సనల్ ట్రైనింగ్ తదితర రంగాల్లో ఉపాధి, ఎన్నో ప్రయోజనాలు పుష్కలంగా ఉన్నాయి.

జియాగూడలో జపానీస్ స్టైల్ షాటోఖాన్ కరాటే ప్రారంభం..

జియాగూడలోని సబ్జిమండి వీరాభిమాన్యు వ్యాయామశాలలో జపానీస్ స్టైల్ షాటోఖాన్ కరాటే అసోసియేషన్ ద్వారా 1984లో ప్రారంభించగా శిక్షకులుగా ముల్తాంకార్ శ్రీ బాలాజీ కేవలం 15 మంది చిన్నారులతో చేపట్టారు. కరాటే, కిక్ బాక్సింగ్‌లో అంచెలంచెలుగా ఎదుగుతూ సుమారు 5 వేలకు పైగా చిన్నారులు, యువకులు శిక్షణలు పొందారు. సబ్జిమండితో పాటు రహింపురా ఆటస్థలం, అబిడ్స్, నాంపల్లి, సికింద్రాబాద్, పాతబస్తీ, ఎంసీహెచ్ కమ్యూనిటీ హాళ్లలో కూడా అసోసియేషన్ ద్వారా కరాటే, కిక్ బాక్సింగ్‌లలో శిక్షణలు కొనసాగుతున్నాయి.

జాతీయ స్థాయిలో రాణింపు..

హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, బాంబే, కోల్‌కత్తా, ఛత్తీస్‌ఘడ్, జమ్మూకశ్మీర్, రాజస్థాన్, హరియాణా తదితర రాష్ట్రాల్లో జాతీయ స్థాయిలో జరిగే కరాటే కిక్ బాక్సింగ్‌లలో వేలాది మంది క్రీడాకారులు బంగారు, వెండి, బ్రాంజ్ మెడల్స్ సాధిస్తున్నారు.

కరాటేతో ఉపాధి అవకాశాలు మెండు



కరాటే కిక్ బాక్సింగ్‌లలో శిక్షణలు పొందినవారు ఆరోగ్యం, ఆత్మస్థైర్యంతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఎంతో మంది యువతీ యువకులు ఎంతో మక్కువతో నేర్చుకొని రాణిస్తున్నారు. రాష్ట్రం నుంచి అంతర్జాతీయ స్థాయిలో పర్సనల్ ట్రైనర్స్‌గా కూడా మంచి ఉపాధి పొందుతున్నారు.

– ముల్తాంకార్ శ్రీ బాలాజీ, ఏఐకేఎఫ్ జాయింట్ కోశాధికారి

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9989616273